


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY









PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 22-08-2025 సంపుటి : 07 సంచిక : 104 పేజీలు : 8 వెల : రూ 3-00


# 18 వేల కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించనున్న ప్రధాని మోదీ



భారత ప్రధాని నరేంద్ర మోదీ బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో శుక్రవారం పర్యటించనున్నారు. పర్యటన సందర్భంగా రెండు రాష్ట్రాల్లో 18 వేల కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. బీహార్‌లో 13 వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులను, పశ్చిమ బెంగాల్‌లో 5,200 కోట్ల రూపాయల ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. బీహార్ పర్యటన సందర్భంగా రెండు రైళ్లను ప్రారంభిస్తారు. గయ, ఢిల్లీల మధ్య తిరిగే అమ్రిత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును.. వైశాలి, కోధర్మల మధ్య తిరిగే బుద్ధిస్ట్ సర్క్యూట్ ట్రైన్‌ను మోదీ ప్రారంభిస్తారు.అంతేకాకుండా ఎన్‌హెచ్ 31పై 8.15 కిలోమీటర్ల పొడవైన ఆంటా – సిమారియా బ్రిడ్జిని, గంగానదిపై 1.86 కిలోమీటర్ల ఆరు లైన్ల బ్రిడ్జిని కూడా ఆయన ప్రారంభిస్తారు. గంగానదిపై ఆరు లైన్ల బ్రిడ్జి కారణంగా మొకామా నుంచి బెగుసరాయ్‌కి డైరెక్ట్ కనెక్టివిటీ ఏర్పడనుంది. ఈ బ్రిడ్జీల నిర్మాణం కోసం ప్రభుత్వం ఏకంగా 13వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు బీహార్ ప్రభుత్వం చెబుతోంది.'ఈ బ్రిడ్జి కారణంగా ఆ ఏరియాల్లో ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుంది. ఉత్తర బీహార్ అభివృద్ధి చెందుతుంది.ఇక్కడి వారు ముడి సరుకుల కోసం ఇతర అవసరాల కోసం జార్ఖండ్, దక్షిణ బీహార్ మీద ఎక్కువగా ఆధారపడుతున్నారు. వారికి చాలా మేలు జరుగుతుంది' అని ఓ ప్రకటనలో ప్రభుత్వం తెలిపింది. ఇక, పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా నిర్మితమైన మెట్రో ట్రైన్ సర్వీసులను ప్రధాని మోదీ ప్రారంభిస్తారు. రేపు (ఆగస్టు 22)వ తేదీన మధ్యాహ్నం 4.15 గంటలకు మెట్రో సర్వీసును ప్రారంభిస్తారు. అంతేకాదు.. జెస్సోర్ రోడ్ నుంచి జై హింద్ భీమన్బందర్ (ఎయిర్ పోర్టు)వరకు మెట్రో రైలులో ప్రయాణిస్తారు.

# ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు పాస్



న్యూఢిల్లీ, ఆగస్టు21: ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు2025 ఎట్టకేలకు పార్లమెంట్‌లో పాసైంది. ఇవాళ రాజ్యసభలో ఆ బిల్లుకు ఆమోదం దక్కింది. విపక్షాలు తీవ్ర ఆందోళన చేపడుతున్న నేపథ్యంలోనే బిల్లును పాస్ చేశారు. ఎటువంటి చర్చ లేకుండానే బిల్లుకు పచ్చజెండా ఊపారు. కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఆన్‌లైన్‌లో జరిగే అన్ని రకాల మనీ గేమ్స్‌ను నిషేధిస్తూ ఈ బిల్లును రూపొందించారు. అయితే ఈ బిల్లు ద్వారా ఈస్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమింగ్‌ను మాత్రం ప్రమోట్ చేస్తున్నారు. విపక్ష సభ్యులు ఇచ్చిన సవరణలను తోసిపుచ్చుతూ.. ఇవాళ రాజ్యసభలో ఆ బిల్లుకు ఆమోదం దక్కింది. ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు బుధవారం లోక్‌సభలో క్లియరెన్స్ దక్కిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్ మనీ గేమ్స్, బ్యార్ బ్యాంక్స్, ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు చెందిన వాణిజ్య ప్రకటనపై కూడా నిషేధం విధించారు. డబ్బులు డిపాజిట్ చేసి ఆన్‌లైన్ మనీ గేమ్స్ ఆడే విషయం తెలిసిందే. గెలిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయన్న ఆశతో ఈ క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతోంది.

# ఎమ్మెల్యేలు ఇలా చేస్తే ఎలా..

## సీఎం చంద్రబాబు ఫైర్

అమరావతి, ఆగస్టు21, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఇవాళ(గురువారం) ఏపీ సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సీఎం చంద్రబాబు చర్చించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. నేతలు ఇష్టమొచ్చినట్లుగా ప్రవర్తిస్తే ఉపేక్షించేంది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యేలే అడ్డగోలుగా వ్యవహారిస్తే ఎవరూ బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తప్పు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. ఏపీలో క్రిమినల్ మాఫియా ఒకటి తయారైందని ధ్వజమెత్తారు. వీళ్ల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయా జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు వారి పరిధిలోని ఎమ్మెల్యేలను పిలిపించి వెంటనే మాట్లాడాలని సూచించారు సీఎం చంద్రబాబు.

**ఏడుగురు ఎమ్మెల్యేల తీరుపై ఫైర్...**

ఉదయం కేబినెట్ సమావేశానికి ముందు సీఎం నివాసంలో మంత్రి నారా లోకేష్‌తో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో మంత్రులు పాల్గొన్నారు. బ్రేక్ ఫాస్ట్



మీటింగ్‌లో కూడా పలు జాగ్రత్తలను మంత్రి లోకేష్ సూచించారు. ఏడుగురు ఎమ్మెల్యేలు వ్యవహారించిన తీరుపై లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి విషయం మంత్రులు లోకేష్ దగ్గర ప్రస్తావించారు. ఇలా రోడ్డు మీద పడి దాడి చేయడం ఏమిటని లోకేష్ ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే సహించేది లేదని హెచ్చరించారు. సీఎం చంద్రబాబు కూడా చాలా సీరియస్‌గా ఉన్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు ముఖ్యంగా స్త్రీ శక్తి పథకం బాగా జనంలోకి వెళ్లాయని తెలిపారు మంత్రి నారా లోకేష్.పులివెందుల మనం గెలిచిన విషయం కూడా ప్రజల్లోకి వెళ్లిందని.. కానీ ఈ సమయంలో ఎమ్మెల్యేలు ఇలా చేస్తే అది ఎక్కువగా జనంలోకి వెళ్తుందని పేర్కొన్నారు. ఇలాంటి ఎమ్మెల్యేలు అందరినీ కట్టడి చేయాలని లోకేష్ చెప్పుకొచ్చారు. వీరిని కట్టడి చేయాల్సిన బాధ్యత ఇన్‌చార్జి మంత్రులదేనని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. లేడీ ఉండాలని సూచించారు. పెరోల్ ఇచ్చే విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలని హోంమంత్రి వంగలపూడి అనితకి దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యేలు పెరోల్ కోసం సిఫార్సు చేసిన విషయాన్ని లోకేష్ ప్రస్తావించారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే సునీల్ పేరును లోకేష్ ప్రస్తావించారు. అందుకనే ఎమ్మెల్యేలు జాగ్రత్తగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. ఈ నెల 23వ తేదీన మంత్రులు, కొంతమంది ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు నివాసంలో భేటీ అవుతారని వెల్లడించారు.

# ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేయండి

## రైతులు నానో యూరియాను వాడండి :జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

విభారేకర్నూలు, ప్రతినిధి.ఆగస్టు 21:- ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు..గురువారం కృష్ణగిరి మండల కేంద్రంలోని ఆముదం పంటను పరిశీలించి, ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు..ఈ సందర్భంగా కలెక్టర్ ఆముదం పంటను పరిశీలిస్తూ ఆముదం పంట పండిస్తున్నరైతు మధు తో మాట్లాడుతూ ఆముదం పంటకు ఎకరానికి ఎంత పెట్టుబడి పెడుతున్నారు ??ఎకరానికి ఎంత లాభం వస్తుందని రైతును అడిగి తెలుసుకున్నారు.. మండల వ్యవసాయ అధికారితో మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్న విధానాన్ని కలెక్టర్ పరిశీలిస్తూ, ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు ఈ క్రాప్ బుకింగ్ చేశారని కలెక్టర్ వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు.. మండలంలో పంట నష్టం ఎన్యూమరేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు.. యూరియా కి సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.. రైతులు భూసార సంరక్షణకు వీలుగా నానో యూరియాను వాడాలని కలెక్టర్ సూచించారు..జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగును ప్రోత్సహించండిజిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగును ప్రోత్సహించి, రైతులకు ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు..ఆయిల్ పామ్ పంట సాగు చేస్తున్న బ్రహ్మానందరెడ్డి అనే రైతు పొలాన్ని కలెక్టర్ పరిశీలిస్తూ, ఎన్ని ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగు చేస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు.. ఆయిల్ పామ్ మొక్కలు నాటడానికి సంవత్సరానికి రైతులకు ప్రభుత్వం హెక్టార్ కు 5 వేల 250 రూపాయల సబ్సిడీ ఇవ్వడంతో పాటు అదే విధంగా అంతర పంటలు వేసుకునేందుకు 5 వేల 250 రూపాయలు మంజూరు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. అందుకు సంబంధించిన డబ్బులు జమ అయ్యాయా అని కలెక్టర్ రైతును అడిగి తెలుసుకున్నారు..నిధులు జమ అయ్యాయని రైతు తెలిపారు.. కృష్ణగిరి మండలంలో ఇప్పటివరకు ఎన్ని ఎకరాలలో ప్లాంటేషన్ చేయించడం జరిగిందని కలెక్టర్ హార్టికల్చర్ అధికారిని అడిగి తెలుసుకున్నారు.. 30 హెక్టార్లలో సాగు చేశామని హార్టికల్చర్ అధికారి తెలిపారు..రైతులు పత్తి,కంది, మినుము, పెసర తదితర పంటలతో అంతర పంటల సాగు చేసుకోవాలని సూచించారు..హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ ను పరిశీలించిన కలెక్టర్×హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ ను జిల్లా కలెక్టర్ పరిశీలిస్తూ ఉమ్మడి జిల్లాలో ఉన్న 68 చెరువులకు ఇప్పటివరకు పూర్తి స్థాయిలో నీరు అందించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.. హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ సమీపంలో ఉన్న ఒక రైతు పొలం నుండి పైప్ లైన్ వేసినట్లయితే 200 ఎకరాల పొలం సాగులోకి వస్తుందని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కొంతమంది రైతుకు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఒకసారి ఈ అంశాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ ని ఆదేశించారు... కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ పాండురంగయ్య , జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ ప్రసాద్, ఎంపిడిఓ మోహన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ నరేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.






# సంపాదకీయం

**శుక్రవారం 22-08-2025**

## బీహార్ ఓట్ల తొలగింపు ఒక్కటే సమస్యా ?

కొత్త పార్లమెంట్ భవనం అందుబాటులోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తోంది. కొత్త భవనంలో పాత విధానాలతోనే కార్యక్రమాలు సాగాయి. సరైన చర్చలకు ఆస్కారం కలగడం లేదు. వానాకాలం సమావేశాలు కూడా యథాలాపంగా సాగాయి. బీహార్ ఓట్ల గొడవతో విపక్షాలు సమస్యలపై చర్చకు పూనుకోలేదు. రాజకీయంగా లబ్ది పొందే క్రమంలో దీనిపై రగడ చేస్తూనే ఉన్నారు. ఇకపోతే రాజకీయ నాయకుల నేరచరిత్రకు సంబంధించిన బిల్లు బుధవారం పార్లమెంట్ ముందుకు వచ్చింది. పదవిలో ఉంటూ ఏదైనా నేరాల్లో ఇరుక్కుని జైలు పాలయితే ఎంతటి పదవిలో ఉన్నా, అది ఉద్వాసన జరిగేలా ఓ చట్టం తీసుకుని వచ్చారు. ఇది అందరికీ సంబంధించినదే. కానీ విపక్షాలు దీనిని కూడా తప్పు పట్టాయి. అంటే రాజకీయ నేతలు నేరాలు చేస్తే చూస్తూ ఊరుకోవాలా అన్నది అర్థంకావడం లేదు. చట్టం ఎవరికైనా ఒక్కటే. దీనిపై చర్చించడంలో విపక్షాలు విఫలం అయ్యాయి. బీహార్ ఒక్కటే దేశ సమస్య కాదు. అందుకే గత జూలై 21న సమావేశాలు ప్రారంభం కాగా ఇప్పడి వరకు పెద్దగా చర్చలు సాగలేదు. దేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలు వారికి కానరావడం లేదు. ప్రధాన సమస్యలపైనా చర్చ చేయలేదు. ఓ రకంగా చెప్పాలంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టాక చరిత్ర సృష్టించే నిర్ణయాలు తీసుకుంటుందని ఆశించారు. కానీ అలాంటి దేమీ కనిపించలేదు. మూడోదఫాలో మరింత సమర్థంగా, మరింత ఉత్సాహంగా పనిచేస్తానన్న మోడీ వచనాలు ఎక్కడా ప్రతిఫలించడంలేదు. దేశంలో అభివృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు సాగుతున్నాయన్న నమ్మకం కలిగించలేకపోయారు. ప్రజల సమస్యలను విస్తృతంగా చర్చించాలి. ఇందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వడం ద్వారా సమస్యలపై చర్చ జరిపి ఉంటే బాగుండేది. దేశంలో ప్రస్తుత రాజకీయ వ్యవస్థ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పటిష్టమైన ఎన్నికల విధానం కూడా అవసరం ఉంది. ఇవన్నీ చర్చించడం ద్వారా నవ భారతానికి శ్రీకారం చుట్టాలి. 370 ఆర్టికల్‌ను రద్ద చేయడం లాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న మోడీ ప్రభుత్వానికి ఈ నిర్ణయాలు ఏమంత పెద్దవి కాక పోవచ్చు. గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఆదర్శ రాజకీయాల కు శ్రీకారం చుట్టాలి. విపక్షాలు కూడా ఉపన్యాసాలకు, రాజకీయ వ్యాఖ్యలకు అలవాటు పడ్డారు. కేవలం బీహార్‌పై వాయిదా తీర్మానం చర్చించాలన్న ధోరణిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను మరచారు. అందువల్ల సమస్యలను గుర్తించి చర్చించాలన్న ఆలోచన లేకుండా సాగుతున్నారు. దీనిపై గందరగోళం సృష్టించడం ద్వారా తాము విజయం సాధించామని భావిస్తున్నారు. అధికారం యావలో కాంగ్రెస్ ఇలాంటి చెత్త నిర్ణయాలు సాగిస్తోంది. బీహార్ వ్యవహారం బీహార్లో చర్చించాలి. అక్కడే తేల్చుకోవాలి. లేదా ప్రశ్న రూపంలో పార్లమెంటులో చర్చకు రావాలి. ఇకపోతే దేశహితం కోసం మరిన్ని కఠిన చట్టాలను రూపొందించాలి. చర్చల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలి. ఎన్నికల్లో అక్రమాలు నిరోధించేలా నిర్ణయాలు రావాలి. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా చూడాలి. వారు అప్పుల్లో కూరుకుపోకుండా బతికేలా నిర్ణయాలు ఉండాలి. కానీ అలాంటి ప్రయత్నాలు కానరావడం లేదు. అలాగే పార్లమెంట్ సీట్ల సంఖ్యను పెంచడం... గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం కూడా అత్యావశ్యకమే. గవర్నర్ వ్యవస్థ ఈ మధ్యకాలంలో రాజకీయాంగా దుమారం రేపుతోంది. అలాగే ఖజానాపైనా భారీగా భారం పడుతోంది. గవర్నర్ వ్యవస్థలేని రాజ్యాలను నడుపుకోవాల్సి ఉంది. అలాగే ఎప్పుడో 50 ఏళ్ల క్రితం ఉన్న జనాభాకు అనుగుణంగా పార్లమెంట్ సీట్లు ఉన్నాయి. 542 సీట్లతోనే కొనసాగిస్తున్నాం. ఈ క్రమంలో లోక్‌సభ, రాజ్యసభలతో పాటు, అసెంబ్లీల్లో సీట్ల సంఖ్య పెరగాల్సి ఉంది. వాటిని ప్రస్తుత జనాభాకు అనుగుణంగా పెంచుకోవాల్సిందే. కనీసం వేయి సీట్లు ఉంటేనే ఇప్పుడున్న జనాభాకు తగిన ప్రాతినిధ్యం దక్కుదు. 140కోట్లు ఉన్న జనాభాకు అనగుణంగా పార్లమెంట్ సీట్లను పెంచుకోవాలి. అలాగే దేశానికి అనవసర వ్యవస్థగా ఉన్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి. పంచాయితీల్లో ఎంపిటిసిలు,జడ్పీటీసిల వ్యవస్థను ఎత్తేయాలి. పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను దేశ, రాష్ట్రాల జనాభాకు అనుగుణంగా పునర్వ్యవ స్థీకరణ జరగాలి. ఒకేదేశం, ఒకే చట్టం కోసం కసరత్తు జరుగుతున్న వేళ ఇలాంటి కీలక నిర్ణయాలు కూడా జరగాలి. ఇలాంటి అంశాలపై పార్లమెంటులో చర్చించివుంటే బాగుండేది. ఇకపోతే ఎపిలో కాకినాడను ఆనుకుని ఉన్న యానాంను పాండిచ్చేరిలో కాకుండా ఎపిలో విలీనం చేయడంపై ఇంతవరకు ఏ ఒక్కరూ ఎక్కడా ప్రస్తావించడం లేదు. దీంతో ప్రజలకు కూడా పాలనా కేంద్రం దగ్గర కాగలదు. దీనిపై పాలకులు ఎందుకనో డిమాండ్ చేయడం లేదు. ఇలాంటి వాటిని చర్చిస్తే మంచిది. ఇందుకోసం పార్లమెంటులో చర్చించాలి. వ్యవస్థల ద్వారా మేలు జరగాలి. ఉపయోగం కలగాలి. అంతేకానీ గుదిబండగా మారరాదు. అలాగే ఆర్థిక భారంగా కూడా మారరాదు. ఇప్పుడు ఎన్నికల సంస్కరణలతో పాటు రాజకీయ వ్యవస్థల పైనా విచారణ జరగాలి. గవర్నర్లు బిల్లుల తొక్కి పెట్టడంపై సుప్రీం కీలక వ్యాఖ్యలు చేసింది.ఇలాంటి వాటిని కూడా చర్చించాలి. అమిత్ షా ప్రవేశ పెట్టిన బిల్లులపైనా విపక్షాలు చర్చించాలి. తప్పులుంటే నిలదీయాలి. అంతేగాని గుడ్డిగా వ్యతిరేకించడం తగదు.

# యూరియాపై ఎందుకీ దోబూచులాట

హైదరాబాద్,ఆగస్ట్21: యూరియా కోసం రైతులు రోడ్డెక్కుతుంటే ప్రభుత్వం బాధ్యతాయుత ప్రకటన చేయడం లేదు. లేఖలు రాసినా స్పందించడం లేదు. ఇదేదో తమకు సంబంధించిన వ్యవహారం కాదన్న విధంగా మౌనంగా ఉన్నారు. తెలంగాణలో ఇటీవలి వరకు బిజెపి నేతలు ఎదురుదాడి చేశారు. తగినంతగా యూరియా సరఫరా చేసినా బ్లాక్ మార్కెట్‌కు తరలించారని విమర్శలు చేశారు. ఇంతగా బాధ్యతా రహితంగా ప్రకటన చేయడం ఎంతవరకు సమంజసం. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. రాష్ట్రంలో ఎరువుల కొరత పాపం ముమ్మాటికీ రాష్ట్రంలోని కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీలదే. ఎరువులను కొందరు కాంగ్రె స్ నాయకులు బ్లాక్ మారెట్‌లో అమ్ముకుంటున్నారన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలి. 70 లక్షల మంది తెలంగాణ రైతులు యూరియా కోసం అల్లాడుతుంటే బీజేపీలు నేతలు మాట్లాడక పోవడం దారుణం. ఎరువుల కొరతపై కేం÷-రం స్పష్టత ఇవ్వాలి. రెండు నెలలుగా తెలంగాణలోని ఏ పల్లె చూసినా రైతుల దయనీయ పరిస్థితి కనిపిస్తున్నది. ఎరువుల కోసం చాంతాడంత లైన్లో ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ నిలబడి రైతులు అవస్థలు పడుతున్నారు. యూరియా కోసం దుకాణాల ముందు మహిళా రైతులు రాత్రంతా పడిగాపులు పడే పరిస్థితికి వచ్చింది. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం

### వ్యవసాయ విధానంపై స్పష్టత ఏదీ సేంద్రియ వ్యవసాయం చర్యలేవీ

పెట్టే తల్లిగా చూసుకోవాలి. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణమాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. కేవలం యూరియా కొరతతోనే అన్నదాతలు పడిగాపులు పడుతుంటే ఎందుకు ఇంత నిర్లక్ష్యమో తెలియాలి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమం గానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. వ్యవసాయరంగంలో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం వచ్చింది. పంటల ఎగుమతులు లక్ష్యంగా వ్యవసాయం మారాలి. సేంద్రియం వైపు సాగు మళ్లకుంటే ప్రజలు మరింతగా అనారోగ్యం పాలు కాగలరని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు మారాల్సి ఉంది. ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్నప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమిా సారం తగ్గుతోంది.

## ముందు చూపు లేని దద్దమ్మ ప్రభుత్వం రేవంత్‌రెడ్డిది : మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, ఆగస్టు 21 : కాంగ్రెస్ ప్రభుత్వానికి సాగునీరు అందించే సోయి లేదు, యూరియా సరఫరా చేసే సోయి లేదు, పండించే పంటను కొనుగోలు చేసే సోయి లేదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. గురువారం నకిరేకల్ మండల కేంద్రంలోని తాటికల్ సింగిల్ విండో కార్యాలయం వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులతో ఆయన మాట్లాడారు. యూరియా కోసం ఎండలో నిలబడ్డ రైతులు, చంటి పిల్లలతో వచ్చిన మహిళా రైతులు, లైన్‌లో చెప్పులు, ఆధార్ కార్డ్ లు పెట్టి యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతన్నల బాధలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుల మాయమాటలతో తెలంగాణ ప్రజానీకం మోసపోయిందన్నారు. ప్రజా అవసరాలు తీర్చాలనే ముందు చూపు లేని దద్దమ్మ ప్రభుత్వం రేవంత్ రెడ్డిది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల ప్రజలు నష్టపోతున్నట్లు తెలిపారు. దళారి వ్యవస్థతో, దగాకోరు మాటలతో ప్రభుత్వం పబ్బం గడుపుతోందని దుయ్యబట్టారు.రైతులను అన్ని విధాలుగా మోసం చేసిన దౌర్భాగ్యపు ప్రభుత్వం రేవంత్ రెడ్డిది అన్నారు. కేసీఆర్ పాలనలో పదేండ్లు యూరియా కొరత రాలేదన్నారు. రైతులకు యూరియానే ఇవ్వలేని దద్దమ్మ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవికి అర్హుడే కాదన్నారు. ఎరువుల కొరత లేదు అనే సీఎం, మంత్రులకు ఎరువులు సరఫరా చేసే ఏదైనా ఒక సొసైటీ దగ్గరరికి వెళ్లి నిలబడే దమ్ముందా? అని ఆయన ప్రశ్నించారు. యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతుల ముందు వెళ్లి నిలబడితే వారి ఎమ్మెల్యేలను,



మంత్రులను ప్రజలు చెప్పులతో కొడతారన్నారు. గత 10 సంవత్సరాలుగా ఉన్న అధికారులే ఇప్పుడు ఉన్నారు, అప్పుడు ఉన్నంత భూమే ఇప్పుడు ఉంది, అప్పుడు వేసిన పంటలే ఇప్పుడు వేసినా యూరియా కొరత ఎందుకు వచ్చిందో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అపుడు కేసీఆర్ ఇచ్చిన యూరియాను ఇప్పుడు రేవంత్ రెడ్డి ఎందుకు ఇవ్వలేక పోతున్నాడని ప్రశ్నించారు.కేసీఆర్ పాలనలో ఒక్క సొసైటీలో ఎప్పుడు కూడా 1000 ఓబ కంటే తక్కువ ఎరువులు లేవని చిరుమర్తి అన్నారు. కానీ ఇప్పుడు అవే సొసైటీలో ఈ సంవత్సరం 400 ఓబ ఎరువులు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఇప్పుడు 25 శాతం యూరియా కూడా అందుబాటులో లేదన్నారు. ఎరువుల కొరత లేదు అని సిగ్గు లేకుండా సీఎం ప్రచారం చేస్తున్నడని దుయ్యబట్టారు. వేలమంది రైతులు రోజుల తరబడి యూరియా కోసం తల్లడిల్లుతుంటే రాష్ట్రంలో అసలు యూరియా కొరత లేనట్లు, కృత్రిమ కొరత సృష్టించారని రేవంత్‌రెడ్డి పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నాడన్నారు. రేవంత్ రెడ్డి వారానికి ఒకసారి ఢిల్లీకి ఎందుకు వెళ్తున్నాడో, ఎవరికి మూటలు అప్పజెప్పుతున్నాడో సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ మంత్రులను, ఎమ్మెల్యేలను గ్రామాల్లో ఉరికించి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రేవంత్ రెడ్డి, వారి మంత్రులు ఢిల్లీకి వెళ్లి మోదీ కాళ్లు మొక్కి అయినా సరే రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలన్నారు. రైతుపైన నిజమైన ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలోని రైతన్నకు కన్నీరు రానివ్వకండని హితవు పలికారు. లేదంటే రైతులకు యూరియా ఇవ్వలేమని క్షమాపణ చెప్పి ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం రైతులను ఇబ్బంది పెడుతున్నది : ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

నల్లగొండ : నెల రోజులుగా యూరియా కొరత తీవ్రంగా వేదిస్తుంది. ఇది ఇంకా తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. రైతులు నిద్రాహారాలు మాని చెప్పులు పెట్టుకుని అవస్థలు పడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండలోని బీఆరెస్ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎకరానికి రూ. 20 వేల పెట్టుబడి పెడితే ఒక్క బస్తా యూరియా మీద దిగుబడి ఆధార పడి ఉంది. కానీ ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదని మండిపడ్డారు.కెసిఆర్ వేసవిలోనే గోదాముల్లో ఎరువులు నిల్వ చేసి పెట్టేవారు. వ్యవసాయ రంగం పై రెగ్యులర్ రివ్యూ చేస్తూ రైతుల ఇబ్బందులు పడకుండ జాగ్రత్త పడేవాళ్లమని గుర్తు చేశారు. కనీసం సీజన్‌లో నాలుగు సార్లు రివ్యూ జరిగేది రైతులు విత్తనాల కోసం, ఎరువుల కోసం ఇబ్బందులు పడడం దారుణం. గతంలో ధాన్యం కొనుగోళ్లకు రైతులు ఇబ్బంది పడ్డారు. కరెంట్ కోసం ఇబ్బందులు మొదలయ్యాయి. యూరియా కొరత వెనక కొంతమంది మంత్రులు, అధికారులు ఉన్నారని ఆరోపించారు. కమీషన్ల కోసం రైతులను ఇబ్బంది పెడుతున్నారు.ఎరువులను బ్లాక్ మార్కెట్ చేసేందుకు కమీషన్లు తీసుకుంటున్నారని విమర్శించారు. గతంలో నల్లగొండ మంత్రి ధాన్యం కొనుగోళ్లలోను కమీషన్లు తీసుకుని రైతులను గాలికి వదిలేసారు. గతంలో మేము వస్తే అన్ని తెస్తామన్నారు. ఢిల్లీకి 56 సార్లు వెళ్లిన సీఎం కనీసం



ఎరువులు తేలేవా? అని ప్రశ్నించారు. పోలీసులతో పహారా, లాఠీఛార్జ్ లతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. ఢిల్లీకి వెళ్లి కాళ్లు పట్టుకుని పదవులు తెచ్చుకునే కాంగ్రెస్ నేతలకు..రైతులను కాళ్లు పట్టుకునే దుస్థితికి తెచ్చారని ధ్వజమెత్తారు. నల్లగొండ నియోజకవర్గంలో మంత్రి పూర్తిగా విఫలం అయ్యారన్నారు. ఇద్దరూ మంత్రులు ఉండి కూడా జిల్లాపై కనీసం రివ్యూ చేయలేదన్నారు. మంత్రుల తీరుతో నల్లగొండ జిల్లా ప్రతి రంగంలో తిరోగమానంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ నియోజకవర్గంలో సాగు నీళ్ల కోసం రైతులు రోడ్డు ఎక్కుతుంటే మంత్రులు సిగ్గు పడాలన్నారు. మంత్రికి చేత కాక అధికారులతో తప్పడు పద్ధతుల్లో ప్రకటనలు చేయిస్తున్నారు.కొరత లేదని తప్పుడు ప్రకటనలు చేసే అధికారులు తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు.మంత్రుల బాధ్యతను మీరు నెత్తిన వేసుకుని ఇబ్బందులు పడొద్దని సూచించారు. అధికారుల ప్రకటన నిజం అయితే రైతులు ఇవ్వాళ కూడా ఎందుకు క్యూ లైన్ల లో ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా రైతులు ప్రభుత్వం మెడలు వంచేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## 'ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల సాధనకు 23న చలో హైదరాబాద్'

ఆళ్లపల్లి, ఆగస్టు 21 : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల సాధన కోసం ఈ నెల 23న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు తెలిపారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూ ఎస్ పి సి) ఆధ్వర్యంలో మూడంచల పోరాట కార్యక్రమంలో చివరిదైనా మహాధర్నా కార్యక్రమాన్ని ఈ నెల 23న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్నట్లు, ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో కదిలి రావాలని పిలుపునిచ్చారు. పాలకులు మారినా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పెద్ద మార్పేమి లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బానోత్ భోజ్య, ఈసం ముత్తయ్య పాల్గొన్నారు.

## యూరియా కొరత రావడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం : సత్యవతి రాథోడ్



మహబూబాబాద్ : సోయిలేని పరిపాలనపై అవగాహన లేని ముఖ్యమంత్రి మన రాష్ట్రానికి ఉండడం మన దురదృష్టకరమని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లానరసింహులపేట మండల కేంద్రంలోని పిఎసిఎస్ గోదం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరి నిరీక్షిస్తుండగా రైతులతో మాట్లాడారు. రైతులకు యూరియా కొరత రావడానికి ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని అన్నారు.బీఆర్ఎస్ పాలనలో ఎన్నడు రైతులకు ఎరువుల కొరత రాలేదన్నారు.రైతులను అన్ని విధాలుగా ఆదుకున్న ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపట్ల ఏమాత్రం సోయిలేదని మండిపడ్డారు. వెంటనే రైతులకు కావాల్సిన యూరియా సరఫరా చేయకపోతే రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

## కాకర్లలో పద్మశాలి సంఘం వన సమారాధన

జూలూరుపాడు, ఆగస్టు 21 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామంలో గురువారం పద్మశాలి సంఘం వన సమారాధన నిర్వహించింది. భారీ ర్యాలీగా పటాకులు కాల్చుతూ డీజే సౌండ్ సిస్టమ్ తో ఇంటిల్లిపాది గ్రామంలోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి దేవాలయం సమీపంలోని పాలగుట్ట వద్దకు బయల్దేరి వెళ్లారు. పరిచయాలు.. పలకరింపులు.. ఆత్మీయ ఆలింగనాలు..యోగక్షేమాలు.. కబుర్లు.. ఆట పాటలు.. డాన్సులు.. సాంస్కృతిక కార్యక్రమాలు, నాయకుల ఉపన్యాసాలు.. సహపంక్తి భోజనాలతో సందడిగా గడిపారు.పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకుడు తుమ్మ నరసింహారావు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పద్మశాలి కుల బంధువులంతా ఐకమత్యంతో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కులస్తులంతా ఐకమత్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పద్మశాలీలు రాజకీయంగా ఎదిగేందుకు కుల బాంధవులు ఐక్యంగా ఉండి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు సోబ్బని సూర్యం, గ్రామ అధ్యక్షుడు సోబ్బని శ్రీను, పడమటి నర్సాపురం గ్రామ అధ్యక్షుడు పెంటి శ్రీను, సీనియర్ జర్నలిస్ట్ గుండా సత్యనారాయణ, మహిళా సంఘం నాయకురాలు తుమ్మ విజయలక్ష్మి, పద్మశాలి సంఘం నాయకులు కొండె వెంకటేశ్వర్లు, కొక్కుల సూరయ్య, కొక్కుల సంతోశ్, కొండె రమేశ్, సోబ్బని లాలయ్య, పోలూరి అప్పయ్య, పోలూరి మురళి, కొండె శ్రీనివాస్, దాసరి నాగయ్య, పోలూరి వెంకటప్పయ్య పాల్గొన్నారు.



# ఉత్తరాంధ్ర కేంద్రంగా రాజకీయం

విశాఖపట్టణం, ఆగస్టు 21, ఉత్తరాంధ్రపై( జనసేన ఫోకస్ పెట్టింది. ఉత్తరాంధ్రలో బలం పెంచుకోవాలని భావిస్తోంది. గత ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో విశేష ప్రభావం చూపింది జనసేన. సీట్లతో పాటు ఓట్ల పరంగా మంచి మార్కులే సాధించింది. అందుకే దానిని కొనసాగిస్తూ.. మరింత బలంగా ముందుకెళ్లాలని చూస్తోంది. అందులో భాగంగా ఈనెల 30న విశాఖ నగరంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించింది. అందుకు సంబంధించి ఏర్పాట్లను కూడా చేస్తోంది. జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పిఠాపురంలో నిర్వహించిన సంగతి తెలిసిందే. అటు తర్వాత పార్టీ పరంగా ఇది రెండో సభ. విశాఖ మున్సిపల్ స్టేడియంలో ఈ సభ జరగనుంది. మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జనసేనకు పట్టున్న ప్రాంతం కావడంతో సభ భారీ స్థాయిలో జరుగుతుందని అంచనాలు ఉన్నాయి.గోదావరి జిల్లాల తర్వాత జనసేనకు పట్టున్న ప్రాంతం విశాఖ మొన్నటి ఎన్నికల్లో పొత్తులో భాగంగా ఆ పార్టీ ఐదు అసెంబ్లీ స్థానాలకు పోటీచేసి అన్నిచోట్ల గెలిచింది. విశాఖ దక్షిణం, అనకాపల్లి, ఎలమంచిలి, పెందుర్తి, చోడవరంలో ఘనవిజయం సాధించింది. అదే సమయంలో విజయనగరం జిల్లా నెల్లిమర్ల, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నియోజకవర్గాలను సైతం కైవసం చేసుకుంది. అటు కూటమి గెలుపులో కీలకపాత్ర పోషించింది. అయితే ఈసారి ఉత్తరాంధ్రలో ఇప్పుడు లభించిన ఏడు స్థానాలతో పాటు మరి కొన్ని స్థానాల్లో గెలుపు కోసం వ్యూహరచన చేస్తోంది. 2029 నాటికి నియోజకవర్గాల పునర్విభజన పూర్తికానుంది. ఉత్తరాంధ్రలో పెరిగే సీట్లపై ఇప్పటినుంచి ఫోకస్ పెట్టాలని భావిస్తోంది. దీనిపై పార్టీ శ్రేణులకు అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ దిశా నిర్దేశం చేయనున్నారు.విశాఖలో కూటమి నిలబడాలి అంటే జనసేన మద్దతు కీలకము. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఇక్కడ పట్టు కోసం ఆరాటపడుతూనే ఉంది. కానీ పట్టు పెంచుకోలేకపోతోంది. అయితే గత ఎన్నికల్లో జనసేన మద్దతు కూటమికి దక్కడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గల్లంతు అయింది. ఇక్కడ పవన్ అభిమానులు అధికం. కాపు సామాజిక వర్గ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అందుకే జనసేన ఇక్కడ ఎంత బలోపేతం అయితే కూటమికి అంత లాభం. అందుకే ఈనెల 30న జనసేన విస్తృత

## ప్రతిపక్షంలో ఉంటేనే ప్రశ్నలా...

స్థాయి సభకు ఏర్పాట్లు భారీగా జరుగుతున్నాయి. ప్రభుత్వం కూడా తన వంతు సహకారం అందించనుంది. చాలా రోజుల తర్వాత జనసేన సభ కావడంతో ఆ పార్టీ హైకమాండ్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.ఇటీవల కూటమిలో సమన్వయ లోపం కనిపిస్తోంది. ప్రధానంగా జన సేన అభిమానులు సోషల్ మీడియాలో తలోవైపుగా మాట్లాడుతున్నారు. దీనిపై పవన్ కళ్యాణ్ పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎక్కడికక్కడే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో ట్రాప్ చేస్తోంది. దానికి చెక్ చెప్పాలంటే పార్టీ శ్రేణులకు ఒక కీలక పిలుపు అవసరం. కచ్చితంగా పార్టీ బలోపేతంపై సూచనలు చేస్తూనే.. పవన్ కళ్యాణ్ పార్టీలో గాడి తప్పుతున్న సమన్వయ లోపాన్ని కూడా సరిచేసే అవకాశం ఉంది. అందుకే ఈ సమావేశం పార్టీ శ్రేణులతో పాటు కూటమికి ప్రతిష్టాత్మకం.అధికారంలో ఉన్నవారికి అంతా బాగున్నట్లే కనపడుతుంది. ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ ఎక్కువగా వినిపిస్తుంది. అది ఎవరైనా కావచ్చు. అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వం చేసే తప్పొప్పులు కనిపించవు. అదే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం అధికార పార్టీ చేసే ప్రతి పని తప్పుగానే కనపుడుతుంది. కానీ తాము అధికారంలో ఉన్నప్పుడు మాత్రం అంతా అభివృద్ధి కనిపిస్తుంది. ఇప్పుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ విషయలోనూ అదే జరుగుతుంది. కూటమిలో ఉన్నప్పుడు అధికార పార్టీని విమర్శించడం సబబు కాదు. అలాగని ప్రతి విషయంలో తలూపడం కూడా అంత కరెక్ట్ కాదన్నది సొంత పార్టీ జనసేన నేతల నుంచి వినిపిస్తున్న మాట. ఎన్నికలకు ముందు పవన్ కల్యాణ్ ఎలా ఉన్నారో అలాగే ఉండాలని అభిమానులు కూడా కోరుకుంటున్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పాటయి దాదాపు పదమూడు నెలలు గడిచిపోతుంది. ఈ పదమూడు నెలల కాలంలో అనేక విషయాల్లో ప్రభుత్వ వైఖరిని తప్పుపడుతూ ప్రజలు ఆందోళన బాట పడుతున్నారు. వైసీపీ నిరసనలు చేపట్టడం వేరు, అది రాజకీయ కోణంలో చూడాలి. కానీ కమ్యునిస్టు పార్టీల నుంచి వచ్చే ప్రశ్నలకు పవన్ కల్యాణ్ కూడా సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. స్మార్ట్ మీటర్ల విషయంలో సీపీఎం పెద్ద యెత్తున ఆందోళన గత కొంతకాలం నుంచి చేస్తుంది. అయితే స్మార్ట్ మీటర్ల విషయంలో ప్రభుత్వం ముందుకు వెళుతూనే ఉంది. దీనిని ఏ పరిస్థితుల్లోనూ పవన్ కల్యాణ్ అభ్యంతరం చెప్పకపోవడాన్ని కూడా పలువురు సోషల్ మీడియా వేదికగా నిలదీస్తున్నారు. మరొకవైపు విశాఖ స్టీల్ ప్లాంట్ ఉన్నప్పటికీ, మరొక స్టీల్ ప్లాంట్ ను అదే జిల్లాలో నెలకొల్పడంతో పాటు ఆ ప్రయివేటు స్టీల్ ప్లాంట్ కు గనులు కేటాయించాలని కోరడం పై సీపీఐ కూడా అభ్యంతరం చేసింది. అలాగే విశాఖపట్నంలోని కొన్ని విభాగాలు ప్రయివేటు పరం చేస్తూ యాజమాన్యం నోటిఫికేషన్ విడుదల చేసిందని స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. అయితే ఎన్నికలకు ముందు స్టీల్ ప్లాంట్ కార్మికులకు మద్దతుగా నిలిచిన పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం వారిని పట్టించుకోకుండా, కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని సమర్ధించడమేంటని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. అందుకే పవన్ కల్యాణ్ చరిష్మా ఎన్నికలకు ముందు ఒకలా.. తర్వాత ఒకలా మారిందన్న కామెంట్స్ బలంగా వినిపిస్తున్నాయి.

# ఎన్నాళ్లకెన్నాళ్లకు....

ఏలూరు, ఆగస్టు 21, భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు దాటిపోయినా.. కనీస సౌకర్యాలు ఎరుగని గ్రామాలు ఎన్నో. అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయిన ఊర్లు ఎన్నో.. ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నా వాటి ఫలితాలు అందని లబ్ధిదారుల ఎంతో మంది ఉంటారు. మరీ ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి తమ ప్రాంతంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలంటూ ఎటపాక స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. సుమారుగా దశాబ్దకాలంగా ఈ డిమాండ్ ఉంది. అయితే ఎట్టకేలకు వారికి ప్రభుత్వం గుడ్ న్యూస్ వినిపించింది.ఈ ప్రాంతంలోని విలీన మండలాల వాసులు నిత్యం తెలంగాణలోని భద్రాచలానికి రాకపోకలు సాగిస్తూ ఉంటారు. విద్య, వైద్యం సహా ఇతరత్రా పనుల కోసం భద్రాచలం వెళ్లి వస్తుంటారు. అయితే ముంపు గ్రామాల బస్సులు కేవలం భద్రాచలం వరకే రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఎటపాక మండలంలోని ఐదు పంచాయతీలకు వెళ్లాలంటే తెలంగాణ మీదుగానే రాకపోకలు సాగించాలి. ఈ నేపథ్యంలో ఎటపాకలో బస్టాండ్ నిర్మించాలని కొన్నేళ్లుగా ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం నుంచి బస్టాండ్ ఏర్పాటు కోసం గ్రీన్ సిగ్నల్ రావటంతో.. విలీన మండలాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత భద్రాచలం గ్రామీణ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. దీంతో విలీన గ్రామాలతో ఎటపాక మండలం ఏర్పాటు చేశారు. ఇక విలీన మండలాల ప్రజల ఇబ్బంది, విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని చింతూరులో బస్టాండ్ నిర్మించారు. ప్రస్తుతం గోకవరం డిపో నుంచి భద్రాచలం వరకు బస్సులు నడుస్తున్నాయి. అయితే ఎటపాక మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలంటూ ఎటపాక ప్రజలు గతంలో పలుమార్లు ప్రభుత్వ అధికారులు వినతులు అందించారు. అయితే ప్రయోజనం లేకుండా పోయింది.అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న సంగతి తెలిసిందే. స్త్రీశక్తి పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నారు. అయితే ఎటపాక మండలంలో బస్టాండు లేకపోవటంతో స్థానిక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. ఎటపాకలో బస్టాండు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆర్టీసీ రాజమహేంద్రవరం రీజనల్ మేనేజర్ ఇతర అధికారులు ఇటీవల ఎటపాకలో బస్టాండ్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. దీంతో ఈ ప్రాంతవాసుల పదేళ్ల ఎదురుచూపులకు తెరపడినట్లైంది.

# మరో వివాదంలో టీడీపీ ఎమ్మెల్యే

కర్నూలు, ఆగస్టు 21, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు వరుసగా వివాదాల్లో చిక్కుకుంటున్నారు.లుగుదేశం పార్టీ అధినేత, సీఎం నారా చంద్రబాబు నాయుడుకు తలనొప్పులు తప్పడం లేదు. టీడీపీ ఎమ్మెల్యేలు వరుస వివాదాల్లో చిక్కుకోవటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. అధినేత చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు, హెచ్చరికలు జారీ చేస్తున్నా.. ఎమ్మెల్యేలు వరుస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఇలా వివాదాల్లో చిక్కుకోవటం తెలిసిందే. తాజాగా మరో టీడీపీ ఎమ్మెల్యే వివాదంలో చిక్కుకున్నారు. టీడీపీకి చెందిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తాజాగా వివాదంలో చిక్కుకున్నారు. తాజాగా శ్రీశైలం టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి , అతని అనుచరులు అటవీ శాఖ సిబ్బందిపై దాడి చేసినట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. అటవీ శాఖను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చూస్తున్నారు. తాము ఎమ్మెల్యేపై పవన్ కు ఫిర్యాదు చేస్తామని అటవీ శాఖ అధికారులు ప్రకటించారు. శ్రీశైలం టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, తన అనుచరులతో కలిసి, నల్లమల అటవీ ప్రాంతంలో రాత్రి సమయంలో లెపర్డ్ పెట్రోలింగ్‌లో ఉన్న అటవీ శాఖ సిబ్బందిపై దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అటవీ శాఖ సిబ్బంది అయిన రామానాయక్, గురవయ్య, మోహన్ కుమార్, కరీముల్లాపై ఈ దాడి జరిగినట్లు కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బుడ్డా రాజశేఖర్ రెడ్డి, అర్ధరాత్రి సమయంలో అటవీ శాఖ సిబ్బంది రాత్రి పెట్రోలింగ్‌ను అడ్డుకున్నాడని, వారి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నాడని చెబుతున్నారు. అటవీ సిబ్బందిని ఒక వాహనంలో బలవంతంగా తీసుకెళ్లి, ఒక గెస్ట్ హౌస్‌లో బంధించి, శారీరకంగా దాడి చేసినట్లు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ దాడిలో సిబ్బంది మొబైల్ ఫోన్‌లు , వాకీ-టాకీలు స్వాధీనం చేసుకోబడినట్లు అటవీ శాఖ అధికారులు ఆరోపించారు. అటవీ శాఖ సిబ్బంది ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు ఈ ఘటనను ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ప్రకటించారు. వైసీపీ ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దౌర్జన్యంతో వ్యవహరించాడని, ఇది రాష్ట్రంలో చట్టం , శాంతిభద్రతల పరిస్థితిని ప్రశ్నార్థకం చేస్తోందని మండిపడింది.ఈ ఘటనకు సంబంధించి సీసీటీవీ ఫుటేజ్ ను అటవీ శాఖ అధికారులచే విడుదల చేసినట్లుగా తెలుస్తోంది. అటవీ శాఖ అధికారులు ఈ ఘటనను ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నారు, మరియు బుడ్డా రాజశేఖర్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు లేదా అటవీ శాఖ కేసు నమోదు చేసినట్లు స్పష్టమైన సమాచారం లేదు. అయితే, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు జరిగే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి వ్యవహారంపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అటవీ శాఖ సిబ్బందితో ఘర్షణ విషయంలో ఎమ్మెల్యే తీరుపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. వివాదాలకు అవకాశం ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తప్పు ఎవరిదైనా సరే కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని.. మొత్తం వ్యవహారంపై నివేదిక ఇవ్వాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

# కసిరెడ్డి ఆస్తులు జప్తు


విజయవాడ, ఆగస్టు 21మద్యం కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఏ1 గా ఉన్న రాజ్ కెసిరెడ్డి ఆస్తులను జప్తు చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మద్యం విధాన వ్యవహారంలో అక్రమాలకు పాల్పడడం ద్వారా కెసిరెడ్డి సుమారు రూ.13 కోట్ల విలువైన ఆస్తులు కొనుగోలు చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. కెసిరెడ్డి తన కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రుల పేర్లతోనూ ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆయన ఆస్తులను జప్తు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

# విశాఖ కేంద్రంగా వ్యూహ రచనలు

విశాఖపట్టణం, ఆగస్టు 21,ఆగస్టు 30, 2025న విశాఖపట్నంలోని మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జనసేన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశం జనసేన అధినేత , ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధ్యక్షతన నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ నుండి జనసేన కార్యకర్తలు, నాయకులు హాజరవుతారు. జనసేన పార్టీ కార్యకర్తలు మరియు నాయకులను ఏకతాటిపైకి తీసుకురావడం, భవిష్యత్తు రాజకీయ వ్యూహాలను చర్చించడం కోసం దీనిని ఏర్పాటు చేశారు. పవన్ కళ్యాణ్ ఈ సమావేశంలో కార్యకర్తలకు ముఖ్యమైన సందేశం ఇవ్వనున్నారు, ఇది పార్టీ లక్ష్యాలు, కూటమి ప్రభుత్వంలో జనసేన పాత్ర, రాష్ట్ర రాజకీయాలపై దృష్టి సారించే అవకాశం ఉంది. రెండు రాష్ట్రాల నుండి జనసేన కార్యకర్తలు, నాయకులు ఈ సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశం రెండు రాష్ట్రాలలో పార్టీని బలోపేతం చేయడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందని బావిస్తున్నారు. జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ మరియు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమావేశం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆయన ఆగస్టు 19న విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించి, ఏర్పాట్లను సమీక్షించారు. జనసేన పార్టీ తన మొదటి ఆవిర్భావ సభను 2014లో విశాఖపట్నంలోనే నిర్వహించింది. 2024 ఎన్నికలలో జనసేన, తెలుగుదేశం పార్టీ, మరియు భారతీయ జనతా పార్టీతో కలిసి ఔఆం కూటమిగా పోటీ చేసి, 175 అసెంబ్లీ సీట్లలో 164 సీట్లను గెలుచుకుంది. జనసేన 21 అసెంబ్లీ సీట్లు , 2 లోక్‌సభ సీట్లను 100% స్ట్రైక్ రేట్‌తో గెలిచింది. ఈ సమావేశం ఈ విజయాన్ని జరుపుకోవడానికి, భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించడానికి ఒక వేదికగా ఉపయోగపడవచ్చునని క్యాడర్ భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఔఆం కూటమి ప్రభుత్వంలో జనసేన కీలక భాగస్వామిగా ఉంది. ఈ సమావేశం ప్రభుత్వంలో జనసేన బాధ్యతలను , రాష్ట్ర అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించడంపై చర్చిస్తారు. జనసేన తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికలలో 8 సీట్లలో పోటీ చేసింది, కానీ గెలవలేదు. ఈ సమావేశం తెలంగాణలో పార్టీ బలోపేతానికి ఒక అవకాశంగా ఉపయోగపడవచ్చునని భావిస్తున్నారు. ఏపీలో జనసేన పార్టీ విజయం తర్వాత పవన్ కళ్యాణ్ బిజీ అయిపోయారు. డిప్యూటీ సీఎంగా ఆయన తీరిక లేకుండా ఉంటున్నారు. అదే సమయంలో ఆయన పూర్తి చేయాల్సిన సినిమాలనూ గ్యాప్‌లలో పూర్తి చేస్తున్నారు. ఇక పార్టీపై కూడా దృష్టి సారించాలని అనుకుంటున్నారు. తెలంగాణలో స్థానిక సంస్థలు ఎన్నికలు జరగాల్సి ఉంది. అదే సమయంలో ఏపీలోనూ కూటమి పార్టీలతో సమన్వయం చేసుకోవడంపై ఆయన కసరత్తు చేయాల్సి ఉంది. ఇప్పటికీ సోషల్ మీడియాలో కొంత మంది పార్టీ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. పిఠాపురంలో జరిగిన పార్టీ ఆవిర్భావ సభలో చాలా వరకూ పవన్ కల్యాణఅ సందేశం ఇచ్చారు. విశాఖ సమావేశంలో కీలకమైన మరిన్ని అంశాలపై స్పష్టత ఇవ్వనున్నారు.

# పీ 4పై చంద్రబాబు ఆశలు

విజయవాడ, ఆగస్టు 21,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను అనుకున్నదే చేస్తారు. దానిపై ఎన్ని విమర్శలు వచ్చినా వెనక్కు తగ్గరు. తనకు అనుకూలమైన మీడియా వ్యతిరేకించినా తాను మాత్రం అనుకున్న దారిలోనే ముందుకు వెళతారు. అందులో పీ4 పథకం పై ఆయన ముందుకు వెళ్లడానికే నిర్ణయించుకున్నారు. ఎవరేమనుకున్నా.. ఎవరేం చెప్పినా తన ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయన్న నమ్మకంతో చంద్రబాబు ఉన్నారు. పేదరిక నిర్మూలన అంటే మొత్తం పేదరికం రూపుమాపడం కాదని, కనీసం వాళ్లు తమ కుటుంబాన్ని పోషించుకునే స్థోమతను కల్పించడమే తన ఉద్దేశ్యమని చెప్పకనే చెప్పుకొచ్చారు. ఇందుకోసం వెనక్కు తగ్గబోమని, పేదవాళ్ల కోసం మనసున్న వాళ్లు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పదే పదే పిలుపు నిస్తున్నారు. గత ఉగాదికి పీ4 పథకాన్ని చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి పేదల



కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకులను కూడా ఎంపిక చేసుకుంటూ వెళుతున్నారు. తాను నియోజకవర్గాలను పర్యటించినప్పుడు కనీసం రెండు, మూడు బంగారు కుటుంబాలను గుర్తించే పనిగా పెట్టుకున్నారు చంద్రబాబు నాయుడు. ఇప్పటికే ఈ పథకం కింద దాదాపు పదమూడు లక్షల మంది బంగారు కుటుంబాలను ఎంపిక చేశారు. అలాగే మార్గదర్శకులుగా ఉండేందుకు దాదాపు 1.40 లక్షల మంది ముందుకు రావడం కూడా పథకం విజయవంతమవుతుందన్న నమ్మకంతో ఉన్నారు. వీరిలో ప్రవాసాంధ్రులతో పాటు పారిశ్రామికవేత్తలు కూడా ఉన్నారు. సంపద సృష్టించడమంటే పేదల ఇళ్లల్లో వెలుగు నింపడమేనని చంద్రబాబు బలంగా విశ్వసిస్తున్నారు. ఈ పథకం వల్ల కొన్ని కుటుంబాలయినా కూడు, గుడ్డ, నివాసానికి ఇబ్బంది లేకుండా ఉండగలిగితే సగం విజయం సాధించినట్లేనని నమ్ముతున్నారు. ఎంతమందికి అవకాశాలు కల్పించామన్నది కాకుండా వారు జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశాలు కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. దీనివల్ల పేదల కుటుంబాల్లో తొలుత మానసికంగా ధైర్యంవస్తుందని, తర్వాత వారు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవడమే కాకుండా పది మందికి ఉపయోగపడేలా తయారవుతారన్నది చంద్రబాబు ఆలోచన. ఈ మేరకు తన సొంత మీడియాలో విమర్శలు వచ్చినా లెక్క చేయడం లేదు. పీ4 పథకం ఖచ్చితంగా సక్సెస్ అవుతుందని ఆయన బలంగా విశ్విస్తున్నారు. మరి ఈ పథకం సక్సెస్ అయితే మాత్రం చంద్రబాబు నాలుగో పర్యాయంలో నూతన పథకంతో జనంలోకి వెళ్లినట్లే అనుకోవాల్సి ఉంటుంది.

# అరుణ..కథ చాలా ఉంది


## 28 లక్షల ఫ్లాట్ 3 లక్షలే చెల్లింపు

నెల్లూరు, ఆగస్టు 21,నెల్లూరు లేడీ డాన్‌గా ప్రచారం పొందుతున్న నిడిగుంట అనే మహిళకు కోర్టు పధ్నాలుగు రోజుల రిమాండ్ విధించింది. కారు ఢిక్కీలో దాక్కుని పారిపోతున్న ఆమెను అద్దంకి వద్ద పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. ఆమెపై ఓ సెటిమెంట్ కేసు నమోదైన కేసులో అరెస్టు చేశారు. అపార్ట్మెంట్ ఓనర్ తో ఫ్లాట్ కొనేందుకు రూ.28 లక్షల బేరం కుదుర్చుకుని రూ.3 లక్షలు మాత్రమే చెల్లించిన అరుణ ..మిగతా డబ్బులు చెల్లించకుండా యజమానిని బెదిరించింది. 2024లో కొంతమంది వ్యక్తులతో కలిసి ఓనర్ ని బెదిరించి..మెడపై కత్తి పెట్టి తనపేరు మీదకి ఫ్లాట్ మార్చాలని బెదిరింపులకు పాల్పడిందని పోలీసులు ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. గత వారం నెల్లూరు జైల్లో జీవిత ఖైదు పడిన కరుడుగట్టిన నేరస్తుడు అయిన శ్రీకాంత్ కు పెరోల్ లభించింది. రెండు జిల్లాల ఎస్పీలు పెరోల్ ను వ్యతిరేకించారు. ఆయన ఓ సారి జైలు నుంచి పారిపోయాడని..అత్యంత తీవ్రమైన నేరాలు చేసే వ్యక్తి అని.. బయటకు వెళ్తే మళ్లీ నేరాలు చేస్తారని ఎస్పీలు స్పష్టం చేశారు. అయితే ఆయనకు పెరోల్ ఇస్తూ నేరుగా హోం సెక్రటరీ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీనికి కారణం నిడిగుంట అరుణ పెద్ద ఎత్తున లాబియింగ్ చేయడమేనన్న ఆరోపణలు వచ్చాయి. తర్వాత మెల్లగా అరుణ గురించిన వివరాలన్నీ బయటకు వచ్చాయి. వైఎస్ఆర్‌సీపీ హయాంలో ఆమె రెండు జిల్లాల పోలీసు ఉన్నతాధికారులను గుప్పిట పెట్టుకుని పెద్ద ఎత్తున దందాలు చేసిందని.. దిశ యాప్ ప్రచారకర్తగా ఓ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు జీవిత ఖైదీగా ఉన్న రౌడీషీటర్ శ్రీకాంత్ ఆస్పత్రిలో ఉన్నప్పుడు పరిచయం పెంచుకుని అతనితో జైలు నుంచే సెటిల్మెంట్లు చేయించిందన్న ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ హయాంలో శ్రీకాంత్ జైలు నుంచి పరారయ్యారు. పోలీసులు పట్టుకోలేదు. చాలా కాలం తర్వాత లొంగిపోయారు తరవాత ఆయనకు పెరోల్ వచ్చింది. పోలీసు ఉన్నతాధికారులను గుప్పిట పట్టుకుని.. కొంత మంది ప్రజా ప్రతినిధుల సిఫారసులతో ఆమె.. నెల్లూరులో సెటిల్మెంట్లు చేయించినట్లుగా ఆరోపణలు ఉన్నాయి.. ఇప్పుడు కూడా శ్రీకాంత్ కు పెరోల్ రావడానికి ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు సిఫారసు చేశారని అంటున్నారు. వారెవరు అన్నదానిపై స్పష్టత లేకపోయినా.. నేరుగా హోంసెక్రటరీ నుంచి ఉత్తర్వులు రాడవంతో చాలా పెద్ద స్థాయిలోనే అరుణ ప్రయత్నాలు చేసినట్లుగా తెలుస్తోంది. ఆమె దందాలపై ఇప్పటికే ఆరోపణలు ఉండటంతో.. కేసుల్ని బయటకు తీసిన పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు సమాచారం కూడా ఆమెకు ముందుగానే తెలిసింది. పోలీసు వర్గాల్లో ఇప్పటికీ ఆమెకు పట్టు ఉందని.. అందుకే ముందుగానే అరెస్టు సమాచారం తెలియడంతో కారు ఢిక్కీలో దాక్కుని .. సెల్ఫీ వీడియో తీసి.. మీడియాకు విడుదల చేశారు. ఆ తర్వాత పోలీసులు ఆమెను అద్దంకి వద్ద అరెస్టు చేశారు. కోర్టు రిమాండ్ విధించింది.

# కొత్త ప్రియుడి కోసం.. భర్తను చంపి...

విజయవాడ, ఆగస్టు 21అక్రమ సంబంధాలు ఎన్నో ప్రాణాలను బలితీసుకుంటున్నాయి.. భార్య భర్తలు.. ఒకరి ప్రాణాలు మరోకరు తీసుకునే స్థాయికి దిగజారడంతోపాటు.. దారుణాలకు పాల్పడుతున్నారు.. ముఖ్యంగా పరాయి వ్యక్తి మోజులో కట్టుకున్న భర్తలను.. భార్యలు హత్య చేయిస్తున్న ఘటనలు ఇటీవల నిత్యం వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా.. ప్రియుడి కోసం ఓ మహిళ.. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తను చంపింది.. ఈ దారుణ ఘటన ఆంధ్రప్రదేశ్‌లో కలకలం రేపింది. ప్రేమించి పెళ్లి చేసుకుని 15 ఏళ్లుగా అన్యోన్యంగా ఉన్న వారి కుటుంబంలో.. వివాహేతర సంబంధం హత్యకు దారి తీసింది. ప్రియుడితో కలిసి ఓ వివాహిత భర్తను హత్య చేసిన ఘటన కృష్ణా జిల్లా గన్నవరం మండలం వెంకట నరసింహపురంలో చోటుచేసుకుంది.. వివరాల ప్రకారం.. లక్ష్మణ్, పావని 15 ఏళ్ల క్రితం పెద్దలను ఎదిరించి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈ క్రమంలో.. లక్ష్మణ్, పావని వెంకట నరసింహపురంలో అద్దెకు ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు కాగా.. వారితో కలిసి నివాసం ఉంటున్నారు.

# వివిధ శాఖల అధికారులకు గణేశ్ నిమజ్జనం కమిటీ అహ్వానం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 21-ఈ నెల 23 వతేదిన ఆర్లగడ్డ అమ్మ వారి శాలలో గణేష్ నిమజ్జన కమిటీ సభ్యుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్లగడ్డ గణేష్ కేంద్ర సమితి అధ్యక్షులు ఆవుల విజయ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆళ్లగడ్డలో గణేశ్ కేంద్ర సమితి అధ్యక్షుడు ఆవుల విజయ భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బత్రెకుల పుల్లయ్య కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులను గురువారం కలిశారు. విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి హాజరు కావాలని అధికారులకు ఆహ్వాన పత్రికలు అందజేశామని అయన తెలిపారు . అమ్మవారి శాలలో ఈనెల 23న జరిగే కమిటీ మీటింగ్ కు అధికారులందరూ రావాల్సిందిగా కోరామన్నారు

## నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

### స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

### ప్రకృతి ప్రేమికులకు ఉచితంగా మొక్కల పంపిణీ



కర్నూలు స్వాతి కిరణం మున్సిపాలిటీ;కర్నూలు నగరంలో విస్తృత హరితీకరణ కార్యక్రమం భాగంగా వేలాది మొక్కలను నాటుతున్నామని, దీనికి ప్రకృతి ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల సహకరించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ కోరారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నగరాన్ని పచ్చగా తీర్చిదిద్దేందుకు ప్రతి వాడ, ప్రతి కాలనీ, ప్రతి సంస్థ నుంచి చురుకైన భాగస్వామ్యం అవసరం ఉందన్నారు. జూన్ మాసం నుండి పదివేల మొక్కలు నాటినట్లు వెల్లడించారు. అశోక్ నగర్ పంప్‌హౌస్ నందు కానుగ, సితాఫల్, బాదం, వేప, రెయిన్ ట్రీ, తదితర మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, ప్రకృతి ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పరిసరాల్లో ఉన్న ఖాళీ స్థలాలు, మైదానాల్లో సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. మొక్క నాటడం మొదటి అడుగు మాత్రమే, దానికి గాను రోజువారీగా నీరు పోయడం, కంచె వేయడం, పశువుల నుంచి రక్షణ, ప్లాస్టిక్/చెత్త పడకుండా చూడడం వంటి సంరక్షణే అసలు ఫలితం ఇస్తుందన్నారు. ప్రతి ఇంటి ముందు, ప్రతి దుకాణం వద్ద, ప్రతి కార్యాలయం, ఎక్కడ మొక్క నాటితే అక్కడ బాధ్యత గల 'ప్లాంట్ గార్డియన్'గా ఒకరు ముందుకు రావాలని సూచించారు. మొక్క బ్రతికితేనే నగరం ఊపిరి పీలుస్తుందని పేర్కొన్నారు.ప్రజలకు కమిషనర్ సూచనలు:-1. ప్రతీ మొక్కకు రోజుకు కనీసం 5?10 లీటర్లు నీరు పోయాలి (ఉదయం/సాయంత్రం).2. చుట్టూ చిన్న కంచె లేదా గార్డ్ ఏర్పాటు చేస్తున్నాం. మట్టి ఎత్తుగా మాడ్లా చేసి మూలాలకు తడి నిల్వ ఉండేలా చూడండి.3. వారం వారానికి ఒకసారి మొక్క చుట్టూ కలుపు తీసి శుభ్రం చేయండి; ప్లాస్టిక్, చెత్త వేయకుండా ఆపండి.4. కాలనీ స్థాయిలో వాట్సాప్/సాధన గ్రూప్ ఏర్పాటుచేసి 'మొక్క?సంరక్షకుడు' (ఖశ్రీజీనిబి ఉబీజీతీటతిజీని)లను నామినేట్ చేయండి.5. పౌరులు తీసిన సంరక్షణ ఫొటోలు, సమస్యలు, సూచనలు కింద ఇచ్చిన హెల్ప్‌లైన్ పంపండి.ప్రత్యేక డ్రైవ్‌లు:పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ/ప్రైవేటు కార్యాలయాలు, మార్కెట్లు స్వచ్ఛందంగా కాలనీల్లో వారాంత హరిత సేవా కార్యక్రమాలు చేపట్టాలని కమిషనర్ పిలుపునిచ్చారు.కార్పొరేషన్ నీటి ట్యాంకర్లు అవసరమైన చోట్ల షెడ్యూల్ ప్రకారం సహాయం అందిస్తాయి. (అభ్యర్థనపై).కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలతో దత్తత పద్ధతిలో సంరక్షణ చేసుకోవాలి.హెల్ప్‌లైన్ ఒ ఫిర్యాదు:వాట్సాప్/ఫోటో అప్‌డేట్: 7422992299మన నగరాన్ని బాధ్యతగా ప్రతి మొక్కను మన పిల్లల భవిష్యత్‌గా భావించి కాపాడుకుందాం. కర్నూలు మరింత పచ్చగా, శుభ్రంగా, చల్లగా మారేందుకు ప్రతి పౌరుడి భాగస్వామ్యం కీలకం.

## నేడు పండ్ల దండల అలంకరణ తో శ్రీ కామేశ్వరీ అమ్మ వారు

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 21-శ్రావణమాసం చివరి శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని మహానంది క్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి అమ్మవారి అలంకారానికి పండ్లను దండలుగా సిద్ధం చేస్తున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు . గురువారం ఒ ప్రకటన లో తెలిపారు. ఆలయంలోని అలంకార మండపంలో మహిళలు భక్తిశ్రద్ధలతో పండ్లను దండలుగా కూరుస్తున్నారని వేద పండితులు బ్రహ్మశ్రీ రవిశంకర్ తెలిపారు. దాతల సహకారంతో పలు రకాల పండ్లతో ప్రత్యేక అలంకారం చేయనున్నామని వేదపండితులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



# కేపీ గ్రూప్ పునరుత్పాదక ఇంధన రంగంలో జాతీయ విస్తరణతో వృద్ధిని వేగవంతం చేస్తోంది








విశాఖపట్నం,విభారే. న్యూస్ నెట్వర్క్ 21 ఆగస్టు 2025: భారతదేశంలో పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రముఖమైన కేపీ గ్రూప్, 2030 నాటికి 10 జిడబ్ల్యూ సామర్థ్యాన్ని సాధించడానికి తన విస్తరణను వేగవంతం చేస్తోంది. గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, ఫ్లోటింగ్ సోలార్, మరియు ఆఫ్‌షోర్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులలో శక్తివంతమైన విస్తరణతో గ్రూప్ రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, మరియు మహారాష్ట్రలలో తన ప్రాజెక్టులను ప్రారంభిస్తోంది.గుజరాత్‌లో ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులుతో పాటు, కేపీ గ్రూప్ రాజస్థాన్, ఒడిశా, మరియు మధ్యప్రదేశ్‌తో 2.6 జిడబ్ల్యూ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు అవగాహన ఒప్పందాలు సంతకం చేసింది. గ్రూప్ ఇప్పటివరకు 2.05 జిడబ్ల్యూ సామర్థ్యాన్ని పనిలో పెట్టింది, మరియు 3.2 జిడబ్ల్యూ కంటే ఎక్కువ ఆర్డర్‌లను నిర్ధారించింది.కేపీఐ గ్రీన్ ఎనర్జీ, క???లోని ఖావ్డాలో గుజరాత్‌లో అత్యంత పెద్ద ప్రైవేట్ సోలార్ పార్క్‌ని నిర్వహిస్తోంది, ఇది 645 మెగా?వాట్ పవర్ సామర్థ్యం కలిగి ఉంది. అలాగే, సంస్థ రోబోటిక్ సోలార్ ప్యానెల్ క్లీనింగ్ సిస్టమ్స్‌ను విజయవంతంగా అమలు చేస్తోంది. కేపీ గ్రీన్ ఇంజనీరింగ్, భరూచ్‌లో కొత్త మాటర్ ఫ్యాక్టరీని ప్రారంభించి, ఆసియాలో అతిపెద్ద గాల్వనైజింగ్ ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తోంది .సమూహం 5 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ప్రాజెక్టు, 1 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ పైలట్ ప్రాజెక్టు, మరియు ఆఫ్‌షోర్ విండ్ ప్రాజెక్టులతో భవిష్యత్తులో మరిన్ని విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది.ఈ సమర్థవం తమైన ఆర్థిక ప్రదర్శనతో, కేపీ గ్రూప్ భారతదేశంలోని ప్రధాన పునరుత్పా దక ఇంధనస్థానాన్నిమరింతబలపరుస్తోంది.

## "ఉల్లాస్... అక్షరాంధ్ర"లో అందరూ భాగస్వాములవ్వాలి:జిల్లా పరిషత్ సీఈవో సుబ్బారెడ్డి




--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 21-రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "ఉల్లాస్... అక్షరాంధ్ర" కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా నిర్వహించడంలో జిల్లా మరియు మండల స్థాయి అధికారులందరూ భాగస్వాములవ్వాలన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఆవరణంలోని పిజిఆర్ఎస్ హాలులో "ఉల్లాస్... అక్షరాంధ్ర" కార్యక్రమం పై జిల్లా స్థాయి ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ... రాష్ట్రవ్యాప్తంగా గతంలో జి ఎస్ డబ్ల్యు ఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కాస్ట్ సర్వే ద్వారా నంద్యాల జిల్లాలో మొత్తం 3,02,050 మంది వయోజన నిరక్షరాసులు గుర్తించబడ్డారని తెలిపారు. వారిలో మొదటి విడతలో 1,00,686 మందిని ఈ సంవత్సరంలో అక్షరాసులుగా మార్చేందుకు సంబంధిత శాఖల సహకారంతో యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే మూడేళ్లలో మొత్తం నిరక్షరాస్యులను అక్షరాసులుగా మార్చి, నంద్యాల జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.ఈ కార్యక్రమంలో వయోజన విద్య ఉప సంచాలకులు చంద్రశేఖర్ రెడ్డి, డి ఆర్ డి ఏ పథక సంచాలకులు శ్రీధర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, డ్వామా పథక సంచాలకులు సూర్యనారాయణ, డి ఎల్ డి ఓ శివారెడ్డి, వయోజన విద్యాశాఖ నోడల్ అధికారి బీవీ భాస్కర్ రెడ్డి, వయోజన విద్యాశాఖ సిబ్బంది, 28 మండలాల ఎంపీడీవోలు ఎంఈఓలు, డిఆర్డిఏ ఏపీఎంలు, డ్వామా ఏపీవోలు, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాలు ప్రతిష్టించిన వారు నియమాలు పాటించాలి

### .--నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 21-వినాయక చవితి సందర్భంగా మండపం వద్ద పాటించవలసిన నియమ నిబంధనలు మరియు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా వినాయక ఉత్సవ కమిటీల వారు పోలీస్ వారి యొక్క అనుమతి ల కొరకు రుసుము లేని సింగిల్ విండో విధానం చేసి మీ యొక్క ఫోన్ నెంబర్ ఎంటర్ చేసి ఒటిపి ద్వారా లాగిన్ అయ్యి వారికి అప్లికేషన్ కొరకు అందులో ఉన్న కాలమ్స్ ను పూర్తి చేసి సబ్మిట్ చేయాలన్నారు .27.09.25 న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో పందిళ్ళు/ మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలు ప్రతిష్టించి ఉత్సవాలు నిర్వహించదలచిన వారు తప్పనిసరిగా ముందస్తు పోలీసు అనుమతి పొంది ఈ క్రింద తెలిపిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించి ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని నంద్యాల జిల్లా ఎస్పీ గారు ప్రజలకు సూచించారు.వినాయక "విగ్రహ ప్రతిష్ఠ పందిళ్ళు/మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి 5 లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి వారి వివరాలు సంబంధిత పోలీస్ స్టేషన్ లలో తెలిపి, వారి గుర్తింపు కార్డు నకలు కాపీలు పోలీస్ వారికి చూపించి అనుమతి పొందవలెను.ప్రైవేట్ లేదా పంచాయతీ/మున్సిపాలిటీ కి సంబంధించిన స్థలాలలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయదలచిన వారు ముందుగా సదరు ప్రవేటు స్థలమైతే స్థల యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే పంచాయతీ లేదా మున్సిపాలిటీ వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.ఫైర్, విద్యుత్ శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి వారు సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా వినాయక చవితి పందిళ్ళు / మండపాలు వద్ద ఇసుక మరియు నీళ్ళను ఏర్పాటు చేసుకుని తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసే నిర్వాహకులు లేదా కమిటీ సభ్యులు తప్పనిసరిగా పాటించాలని ఏదైనా అవాంఛనీయ సంఘటనలో తలెత్తితే పూర్తి బాధ్యత నిర్వాహకులు లేదా కమిటీ సభ్యుల పైన ఉంటుంది.


## చోరికి గురైన రూ. 83 లక్షల విలువ గల 508 సెల్ ఫోన్లు రికవరి ఎస్పీ: ఆదిరాజ్ సింగ్ రాణా



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 21- నంద్యాల జిల్లాలో మొదటిసారి 27-04-2023 తేదిన 847 సెల్ ఫోన్ లు వాటి విలువ 1,52,98,029/-,రెండవసారి 08-10-2023 తేదీన 510 సెల్ ఫోన్ లు వాటి విలువ 86,57,000/-, మూడవసారి 27-09-2024 తేదీన 1066 సెల్ ఫోన్ లు రికవరీ చేయడం జరిగిందన్నారు. వాటి విలువ సుమారు 2,43,10,400/- నంద్యాల జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 2934 మొబైల్ లను రికవరీ చేయడం జరిగిందని మొత్తం వాటి విలువ 5,66,47,429/-.మొబైల్‌ఫోన్ లు పోగొట్టుకున్నవి రికవరీ చేసి ఇవ్వడంతో ఆనందం వ్యక్తం చేసిన బాధితులు. ఆంధ్రప్రదేశ్ గౌరవ డిజిపి హరీష్ కుమార్ గుప్త గారి ఆదేశాలమేరకు మరియు కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ గారి పర్యవేక్షణలో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఐపిఎస్ గారి ఆధ్వర్యంలో మొబైల్ రికవరీచేయడం జరిగింది. ఈ మొబైల్ లను వివిద రాష్ట్రలనుండి అనగా మహారాష్ట్ర, తమిళనాడు ,కర్ణాటక, గోవా , తెలంగాణా మొదలగు రాష్ట్రాల నుండి మరియు ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్టణం, తూర్పుగోదావరి, నెల్లూరు, గుంటూరు, కర్నూలు, కడప, అనంతపురం మొదలగు జిల్లాల నుండి మరియు నంద్యాల జిల్లాలో వివిద ప్రాంతాల నుండి జిల్లా ఎస్పీ గారి ఆదేశాలను సైబర్ ఇన్స్పెక్టర్ వంశీధర్ వారి సిబ్బంది మొత్తం 508 మొబైల్ ఫోన్ లు రికవరీ చేయడం జరిగింది.వీటి విలువ సుమారు 83,82,000/- రూ ఉంది. జిల్లాలోనే అతి తక్కువ సమయంలోనే వివిధ రాష్ట్రాల నుండి రికవరీ చేసిన 508 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధితులకు అందజేశారు.

## 5వ శ్రావణ శుక్రవారం సందర్భంగా వాసవి మాతకు అత్తిపత్తి లక్ష కండ్లు తో అలంకరణ..

విభారే న్యూస్ ఆగష్టు 21 ఎమ్మిగనూరు....రేపు ఐదవ శ్రావణ శుక్రవారం శుభ సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు అమ్మవారు "అత్తిపత్తి(గజ వస్త్రం) లక్ష కండ్లు"తో అలంకరణ. అమ్మవారు దర్శన మిస్తుంది...సాయంత్రం 6:30 గం.లకు కుంకుమార్చన, లలిత సహస్రనామం పల్లకి సేవ పూజ కార్యక్రమం ఉంటుంది.అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి సేవ కృపకు పాత్రులగుదురని కోరుచున్నాము.గమనిక:- పల్లకి, పూజా కార్యక్రమం అనంతరం అల్పాహార విందు ఏర్పాటు చేయడమైనది.అల్పాహార విందు దాతలు..చెరుకు రమేష్(గంధర్వ ఆయిల్ డిపో ) దంపతులు, చెరుకు రవి దంపతులు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190